క్లుప్తంగా

పాలసముద్రం ఎంపీడీఓగా శ్రీనివాసన్


ఎంపీడీఓ శ్రీనివాసన్‌కు స్వాగతం పలుకుతున్న విద్యావతి, సిబ్బంది

పాలసముద్రం: గంగాధర నెల్లూరు నియోజక వర్గంలోని పాలసముద్రం ఎంపీడీఓగా ఆర్.శ్రీనివాసన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన తవణంపల్లి మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసన్‌కు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విద్యావతి సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, ఉపాధిహామీ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

ఘనంగా వైకుంఠనాథ స్వామి కల్యాణోత్సవం


కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

నగరి: మండలంలోని తెరణి వైకుంఠనాథ ఆలయంలో గురువారం స్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి పుష్పాలతో అలంకరించారు. శ్రీదేవి, భూదేవి సమేత వైకుంఠ నాథస్వాముల ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలు, ఆభరణాలు, పుష్పాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవం అనంతరం భక్తులకు పసుపు, కుంకుమ, తలంబ్రాలు, ప్రసాదాలు అందజేశారు. సర్పంచ్ నిర్మల డింపుల్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



దేశయ్య, జయచంద్రారెడ్డి

వెదురుకుప్పం: యూటీఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆ శాఖ జిల్లా కార్యవర్గ సభ్యుడు బిర్లా నాయుడు ప్రకటించారు. గురువారం మండలంలోని పచ్చికాపల్లం ప్రాథమిక పాఠశాలలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడిగా దేశయ్య, మండల అధ్యక్షుడిగా కే.జయచంద్రారెడ్డి, సహాధ్యక్షులుగా కల్పన, బాబు, ప్రధాన కార్యదర్శిగా మర్దాల శ్రీనివాసులును ఎన్నుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారిని తోటి సిబ్బంది అభినందించారు.

పోలీస్‌స్టేషన్‌కి చేరిన టెన్త్ ప్రశ్నపత్రాలు


ప్రశ్నపత్రాలను పోలీస్‌స్టేషన్‌లో భద్రపరుస్తున్న అధికారులు, పోలీస్

పాలసముద్రం: త్వరలో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు గురువారం ప్రశ్నపత్రాలు పోలీస్‌స్టేషన్‌కు చేరినట్లు చీఫ్ సూపరింటెండెంట్ శరవణరెడ్డి, డిపార్టుమెంటు ఆఫీసర్ మురళీకృష్ణ తెలిపారు. వారు మాట్లాడుతూ మండలంలోని ఉన్నత పాఠశాలల్లో జరుగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి రెండు సెట్ల ప్రశ్నపత్రాలు పోలీస్‌స్టేషన్‌కు వచ్చాయన్నారు. ఎస్‌ఐ సురేష్ సిబ్బందితో కలిసి బందోబస్తుగా ప్రశ్నపత్రాలను భద్రపరిచారు.

గడువులోపు చెల్లిస్తే వడ్డీ ఊరట

- మున్సిపాలిటీల్లో మొండి బకాయిదారులకు ప్రభుత్వం తీపికబురు
- పెండింగ్ బకాయిలను ఒకేసారి చెల్లిస్తే వడ్డీ ఒడ్డన
- నగరి, పుత్తూరు మున్సిపాలిటీల్లో రూ.2.56 కోట్లు వడ్డీ మాఫీ
- ఇళ్లు, ఖాళీ స్థలాల పన్నులపై మినహాయింపులు
- చెల్లింపునకు ఈ నెలాఖరు వరకు అవకాశం



నగరి మున్సిపల్ కార్యాలయం

దీర్ఘకాలికంగా మున్సిపాలిటీల్లో వసూలు కావలసిన ఆస్తి, కొళాయి పన్నులపై వడ్డీ రాయితీ ప్రకటిస్తూ రాష్ట్రప్రభుత్వం పన్ను చెల్లింపుదారులకు తీపికబురు అందించింది. వివిధ కారణాలతో దాదాపు పదేళ్లుగా మున్సిపాలిటీకి బకాయిపడిన పన్నులను ఒకేసారి చెల్లిస్తే గనుక వారికి వడ్డీమాఫీ చేస్తున్నట్లు ప్రకటించింది. స్థలాల పన్నులు చెల్లించని వారి నుంచి రెండుశాతం వడ్డీని వసూలు చేస్తారు. అయితే ఈ నెల 31వ తేదీలోగా మున్సిపాలిటీకి పాత, ప్రస్తుత బకాయిలు కలిపి చెల్లించిన వారిపై వడ్డీభారాన్ని ఎత్తివేస్తూ జీఓ నంబర్ 34ను ప్రభుత్వం జారీ చేసింది. తద్వారా మున్సిపాలిటీలోని మొండి బకాయిదారులకు ప్రయోజనం కలగనుంది.

నగరి: నియోజకవర్గంలో నగరి, పుత్తూరు మున్సిపాలిటీలు ఉన్నాయి. అయితే పురపాలక సంఘం పరిధిలో పన్ను బకాయిలు పేరుకుపోయాయి. సదరు మున్సిపల్ సిబ్బందిపై ఉన్నతాధికారులు పన్నుల వసూలుపై ఒత్తిడి తెచ్చినా సరిగా వసూలు అయ్యేవి కాదు. అయితే రాష్ట్రప్రభుత్వం పలు కారణాలతో దాదాపు పదేళ్లుగా మున్సిపాలిటీకి బకాయిపడిన పన్నులను ఒకేసారి చెల్లిస్తే, వారికి వడ్డీమాఫీ చేస్తున్నట్లు ప్రకటించింది. స్థలాల పన్నులు చెల్లించని వారి నుంచి రెండు శాతం వడ్డీని వసూలు చేస్తారు. అయితే ఈనెల 31వ తేదీ లోగా మున్సిపాలిటీకి పాత, ప్రస్తుత బకాయిలు కలిపి చెల్లించిన వారిపై వడ్డీ భారాన్ని ఎత్తివేస్తూ జీఓ నంబర్ 34ను ప్రభుత్వం జారీ చేసింది. సంఘాలు రూ.2.56 కోట్లు మేర ఆదాయాన్ని కోల్పోతాయి. అయితే ప్రజలపై భారాన్ని తగ్గించే ఉద్దేశంతో రాష్ట్రప్రభుత్వం వడ్డీ భారాన్ని తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమని పట్టణ ప్రజలు చెబుతున్నారు. ఈ నెలాఖరు నాటికి పన్ను చెల్లింపుదారులు చెల్లించే మొత్తాలపైనే పురపాలక సంఘాల ర్యాంకింగ్ ఆధారపడి ఉంటుంది. అంతేగాకుండా ఆయా మున్సిపాలిటీల్లో రెవెన్యూ విభాగం పనితీరు సైతం ర్యాంకింగ్ మెరుగు పరుచుకోవడానికి దోహద పడుతుంది.

నగరి మున్సిపాలిటీలో..

నగరి పురపాలక సంఘం పరిధిలో 14,200 మంది పన్ను చెల్లింపుదారులు (అసెస్మెంట్లు) ఉన్నారు. ఈ మున్సిపాలిటీలో ఆస్తిపన్ను పాత బకాయిలతో కలిపి రూ.2.44 కోట్లు ఉంది. పాత బకాయిలు రూ.90.92 లక్షలు ఉంటే దానిపై పెనాల్టీ 1.02 కోట్లు ఉంది. ప్రస్తుత బకాయిలు 46.35 లక్షలు ఉంటే దానిపై పెనాల్టీ 4.9 లక్షలు ఉంది. అంతా కలిపి రూ.2.44 కోట్లు వసూలు కావలసి ఉంది. ఈ సొమ్ము మొత్తాన్ని గడువులోగా పన్ను చెల్లింపుదారులు చెల్లిస్తే, రెండు శాతం వడ్డీ రాయితీ ద్వారా వారికి రూ.1.74 కోట్ల మేర లబ్ధి చేకూరుతుంది.

పుత్తూరు మున్సిపాలిటీలో..

పుత్తూరు మున్సిపాలిటీలో 12,204 పన్ను చెల్లింపుదారులు (అసెస్మెంట్లు) ఉన్నారు. ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్నుల పాత బకాయిలతో కలిపి మొత్తం రూ.2.09 కోట్లు వసూలు కావాలి. ఈ సొమ్ము మొత్తం ఈ నెలాఖరులోగా చెల్లించే పన్ను చెల్లింపుదారులపై రూ.82 లక్షల భారం తగ్గుతుంది. ఇప్పటికే పురపాలక సంఘ రెవెన్యూ విభాగం సిబ్బంది పన్నుల వసూళ్లను వేగవంతం చేశారు. మరోపక్క వడ్డీ రాయితీపై విస్తృత ప్రచారం చేస్తున్నారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం..



ప్రజలపై ఆర్థికభారం లేకుండా పన్నులపై వడ్డీ రాయితీ కల్పించడం హర్షణీయం. పట్టణ ప్రజలు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈ నెలాఖరులోపు పురపాలక సంఘానికి బకాయిపడిన పన్నులను పూర్తిగా చెల్లించి రాయితీని సద్వినియోగం చేసుకోవాలి. ప్రజల్లో అవగాహన పెంచేందుకు మైక్‌ల ద్వారా విస్తతంగా ప్రచారం చేస్తున్నాం. వార్డు సచివాలయాలు, మున్సిపల్ కార్యాలయంలో గానీ, పురసేవా యాప్ ద్వారా గానీ, సీడీఎంఏ.ఏపీ.జీవోవిటీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా గానీ ఆస్తిపన్ను, ఖాళీ స్థలాల పన్ను చెల్లించవచ్చు. మున్సిపల్ సిబ్బందికి, సచివాలయ సిబ్బందికి పన్నుల వసూళ్లపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. ఏవైనా సందేహాలు ఉంటే పురపాలక సంఘ కార్యాలయంలో సంప్రదించాలి.

–వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, నగరి మున్సిపాలిటీ

ఈక్రాప్ బుకింగ్ తప్పనిసరి


చిన్నవేపంజేరిలో ఈక్రాప్ బుకింగ్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

గంగాధరనెల్లూరు: రైతులు సాగు చేస్తున్న పంటలను ఈక్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని చేయాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని చిన్న వేపంజేరి గ్రామంలో గురువారం ఆయన వ్యవసాయాధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అగ్రిస్టాక్ పంటల సర్వే నమోదును కేంద్ర బృందం చేపట్టిందన్నారు. ఈక్రాప్ బుకింగ్ ద్వారా పంటల సర్వేను ఆధార్ లింక్ చేయబడుతుందన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద వర్షాధారం, నీటి ఆధారంపై పంటలసాగును చిత్తూరు జిల్లాను ఎంపిక చేశామని, అందులో జీడీనెల్లూరు మండలం చిన్నవేపంజేరి గ్రామాన్ని ఎంపిక చేశారని వివరించారు. ఈమేరకు రైతులతో సమావేశమై ఈక్రాప్ బుకింగ్‌పై రైతులతో చర్చించారు. పంటల సాగును గ్రామ సచివాలయ సిబ్బంది, వ్యవసాయాధికారులు సమిష్టికృషితో ఈక్రాప్ బుకింగ్ చేయాలని కోరారు. తద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సంచాలకులు సౌభాగ్యలక్ష్మి, జీడీనెల్లూరు వ్యవసాయాధికారి వందన, సర్పంచ్ ఝాన్సీ, ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, స్థానిక నాయకులు హేమశేఖర్‌రెడ్డి, యామిని, పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి


విద్యార్థులకు అందించే రసం, సాంబారుని పరిశీలిస్తున్న ఎంఈఓ

పాలసముద్రం: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం పెట్టాలని ఎంఈఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. గురువారం ఆముదాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థులకు రాగిజావ బాధ్యతగా ఇవ్వాలని సూచించారు. మెనూ ప్రకారం పప్పు, కూరగాయలు, గుడ్లు ప్రతిరోజు సక్రమంగా అందించాలని తెలిపారు. రసం, సాంబారుల్లోకి అయోడిన్ ఉప్పు వాడాలన్నారు. అనంతరం విద్యార్థులకు చేసిన రసం, సాంబారుని రుచి చూశారు. ఆయన వెంట హెచ్‌ఎం గణపతి ఉన్నారు.

విరించి-2కే23 పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి ఎడ్యుకేషన్: శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఏప్రిల్ 11, 12వ తేదీల్లో విరించి-2కే23 పేరుతో జాతీయ స్థాయి కల్చరల్ ఫెస్ట్ నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్, టీజర్, బ్రోచర్, వెబ్‌సైట్‌ను గురువారం ఇన్‌చార్జ్ వీసీ కె.రాజారెడ్డి, రిజిస్ట్రార్ ఎస్.రజని, ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ పి.మల్లికార్జున, అధ్యాపకులు, విద్యార్థులు ఆవిష్కరించారు.

తిరుచానూరుకు రూ.2.55 కోట్లు ఆదాయం

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు గ్రామ పంచాయతీ టూరిస్ట్ బస్టాండ్ పార్కింగ్ వేలం పాట ద్వారా రూ.2.55 కోట్లు ఆదాయం చేకూరింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను పంచాయతీ కార్యాలయంలో గురువారం సర్పంచ్ రామచంద్రారెడ్డి అధ్యక్షతన ఈఓపీఆర్డీ నీలకంఠేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో బస్టాండ్ వేలం పాట నిర్వహించారు. తిరుచానూరుకు చెందిన ధరణి అండ్ కో కంపెనీ ప్రతినిధి నాగిరెడ్డి రూ.2,55,03,000లకు దక్కించుకున్నాడు. దుకాణాల వేలం పాటకు ఎవరూ ముందుకు రాకపోవడంతో వాటిని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు పంచాయతీ సెక్రటరీ లక్ష్మీనారాయణ తెలిపారు. త్వరలోనే వాటికి కూడా వేలం పాట నిర్వహిస్తామన్నారు.

భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తి అవసరం



భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న మురగారెడ్డి తదితరులు, ర్యాలీని ప్రారంభిస్తున్న మురగారెడ్డి

పుత్తూరు రూరల్: ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలని సమాచారం హక్కుల వేదిక కార్యదర్శి కె.మురగారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో గురువారం భగత్‌సింగ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మురగారెడ్డి మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్య్రం కోసం బ్రిటీష్ వారిపై అలుపెరగని పోరాటం చేసిన ఘనత భగత్‌సింగ్‌కే దక్కిందన్నారు. నేటి దోపిడీదారులను ఎదుర్కోవాలంటే ఆయన పోరాట మార్గమే సరైందన్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, సభ్యులు వెంకటరత్నం, మల్లికార్జున, జయచంద్ర, మహేష్, శంకర్, మోహన్, హేమలత, సుభద్ర, అమరావతి, రామూర్తి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా జగనన్న స్వచ్ఛ సంకల్పం


శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ లత

కార్వేటినగరం: జగనన్న స్వచ్ఛ సంకల్పానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ లత పిలుపునిచ్చారు. గురువారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ధనంజయవర్మ ఆధ్వర్యంలో స్వచ్ఛ సంకల్పంపై కార్యదర్శులలకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా తడి, పొడి చెత్తను వేరు చేసి డంపింగ్‌యార్డులకు తరలించాలన్నారు. అక్కడ చెత్త ద్వారా కంపోస్టు ఎరువులను తయారు చేసి స్థానిక రైతులకు పంపిణీ చేయాలన్నారు. ప్రతి రైతు రసాయన ఎరువులకు స్వస్తి చెప్పి సేంద్రియ ఎరువుల వాడకంపై మొగ్గు చూపాలని సూచించారు. అనంతరం సర్పంచ్ ధనంజయవర్మ మాట్లాడుతూ కార్వేటినగరం పంచాయతీ ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించాలని, అదే విధంగా ప్లాస్టిక్ నివారణకు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్‌మురళి, ఈఓపీఎస్ మణి, ఈఓపీఆర్డీ లక్ష్మిపతి, నియోజకవర్గంలోని ఆరు మండలాలతో పాటు పూతలపట్టు, తవణంపల్లి, నింద్ర మండలాలకు చెందిన సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నగరిలో వడగండ్ల వర్షం

- మాంగాడులో ఉరుములు, మెరుపులు, హోరుగాలులు
- శబ్దాలకు ఇళ్లకే పరిమితమైన జనం
- లోతట్టు ప్రాంతాలు జలమయం


వడగండ్ల వానలో పడిన ఐసురాళ్లు


బుగ్గ అగ్రహారంలో నివాసాల సమీపంలో ప్రవహిస్తున్న వర్షపు నీరు

నగరి: నగరి పట్టణంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గురువారం వీచిన హోరుగాలులకు పడిపోతాయేమో అనేలా చెట్లన్నీ ఊగిసలాడాయి. అరటిచెట్లు, మునగ చెట్లు విరిగి పడ్డాయి. పలు ప్రాంతాల్లో రోడ్లపై బారికేడ్లు, సూచిక బోర్డులు నేలవాలాయి. మండలంలోని మాంగాడు గ్రామంలో సోమవారం వడగండ్ల వాన కురిసింది. పెద్దరాళ్లు పడితే శబ్దం ఎలా వస్తుందో అలాగే ఇంటి డాబాలపై, రేకులపై వడగండ్లు పడడంతో జనం ఇళ్లలోనే ఉండిపోయారు. రోడ్లపై పడిన వడగండ్లను చూసి ఆశ్చర్య పోయారు. ఇంటి ఆవరణల్లో వడగండ్ల గడ్డలు పడుతుండడం చూసి చిన్నారులు గంతులు వేశారు. మండలంలోని బుగ్గ అగ్రహారం గ్రామంలోని తూర్పు వీధిలో వర్షపు నీరు పెద్ద ఎత్తున చేరడంతో ఇళ్లలోకి వర్షపు నీరు ప్రవేశించింది. దీంతో నివాసితులు ఇబ్బందులకు లోనయ్యారు.

దాతల సేవలు ప్రశంసనీయం


మాట్లాడుతున్న సీఐ గంగిరెడ్డి

గంగాధరనెల్లూరు: అంగన్‌వాడీ కేంద్రంలో విద్యను అభ్యసిస్తున్న పిల్లలకు యూనిఫాం పంపిణీ చేసిన దాతలు నందనూరు సురేష్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి సేవలు ప్రశంసనీయమని తూర్పు విభాగపు సీఐ గంగిరెడ్డి కొనియాడారు. మండలంలోని పాపిరెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలోని 53 మంది చిన్నారులకు దాతలు అందించిన ఒక్కొక్కరికి రెండు జతల యూనిఫాంను గురువారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని కోరారు. విద్యార్థులకు ఆటపాటల ద్వారా విద్యనందిస్తే సులభంగా నేర్చుకునేందుకు వీలుంటుందన్నారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిన్నమరెడ్డి, సీడీపీఓ వినతశ్రీ, మహిళాపోలీస్ డాక్టర్ శ్వేత, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎంపీపీ లత, మహిళలు, సమావేశానికి హాజరైన మహిళలు

- ఎంపీపీ లత

కార్వేటినగరం: మహిళల అభివృద్ధే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని ఎంపీపీ లత అన్నారు. గురువారం స్థానిక ధర్మరాజుల స్వామి ఆలయ ఆవరణలో వైఎస్సార్ ఆసరా పథకాన్ని ఏపీఎం విజయకుమార్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎన్నికల వేళ ఇచ్చిన హామీలన్నింటినీ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడతల వారీగా 98 శాతం నెరవేర్చారని, అందులో భాగంగా మూడోవిడత వైఎస్సార్ ఆసరా పథకాన్ని 25వ తేదీ శనివారం లాంఛనంగా ప్రారంభించనున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి క్యాలెండర్ వారీగా పథకాలను అమలు చేస్తున్న సీఎం జగనన్నకు మహిళాలోకం రుణపడి ఉండాలన్నారు. పసుపు–కుంకుమ పేరుతో మహిళలను మోసం చేసిన పచ్చగ్యాంగ్ మాటల మాయలో పడవద్దని సూచించారు. అనంతరం మండల కన్వీనర్ ధనుంజయవర్మ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న మూడోవిడత వైఎస్సార్ ఆసరాతో ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పథకాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ముందుకు వెళ్లాలని సూచించారు. అనంతరం ఇండియన్ బ్యాంకు మేనేజర్ మనోజ్ మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మండలంలోని 946 మహిళా సంఘాలకు రూ.9.40 కోట్లు మంజూరు అయిందన్నారు. ఇందులో భాగంగా మేజర్ పంచాయతీ కార్వేటినగరానికి 239 గ్రూపులకు రూ.2.40 కోట్లు కేటాయించామన్నారు. లబ్ధిదారులు ఈ నెల 27వ తేదీ నుంచి బ్యాంకులో నగదు డ్రా చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ గోపి, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీఓ మోహన్‌మురళి, ఎంపీటీసీ లక్ష్మమ్మ, పట్టణ అధ్యక్షురాలు మోహనకుమారి, మండల సోషల్ మీడియా కన్వీనర్ రఫీ, వెంకటేష్, మహిళలు, వెలుగు సీసీలు పలువురు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించండి



బహుమతులు అందజేస్తున్న డీఈఓ విజయేంద్రరావు

గంగాధరనెల్లూరు: విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత విద్యను అభ్యసించాలని జిల్లా విద్యాశాఖాధికారి విజయేంద్రరావు తెలిపారు. మండలంలోని శ్రీభానోదయ ఇంగ్లిషు మీడియం పాఠశాలలో సీబీఎస్‌ఈ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి డీఈఓ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. విద్యార్థులు విద్యతో పాటు సాంకేతిక పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. ప్రణాళిక ప్రకారం విద్యను అభ్యసిస్తే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చన్నారు. విద్యార్థులు విద్య ప్రాధాన్యతను గుర్తించి చదవాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీదేవి, కరస్పాండెంట్ నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ లావణ్యాబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీని ప్రారంభిస్తున్న సీడీపీఓ పద్మజ


తల్లులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు

పుత్తూరు రూరల్: చిరు ధాన్యాలను తీసుకోవడం ద్వారా శరీరానికి మంచి పోషకాలు అందుతాయని సీడీపీఓ కె.పద్మజ తెలిపారు. పోషణ్ పక్వాడా పక్షోత్సవాల్లో భాగంగా గురువారం పుత్తూరు మండలం కైలాసపురం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ శరీరంలో పోషక లోపం రాకుండా తల్లులతో పాటు పిల్లలు పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. చిరుధాన్యాల్లో పోషక విలువలు మెండుగా ఉన్నాయని తెలిపారు. ఆకుకూరలు రోజూ తీసుకునే ఆహారంలో ఉండేలా చూసుకోవాలని సూచించారు. జొన్నరొట్టె తయారీ విధానాన్ని చూపించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రోజారమణి, కృష్ణవేణి, తల్లులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణపై అవగాహన

నగరి: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని మిట్టపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ్ పక్వాడా సంబరాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటి సందర్శన, ఆహార ప్రదర్శన, తక్కువ ధర న్యూట్రిషన్ ఫుడ్‌పై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అంగన్‌వాడీ సిబ్బంది ప్రతి దినం ఆహారంలో మిల్లెట్స్ కలిపి తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్యపరమైన మేలును వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లులు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పోషకాహారంతో మెరుగైన ఆరోగ్యం

వడమాలపేట: విద్యార్థులకు చిన్న వయసు నుంచే పోషక విలువలు ఉండే ఆహారం అందించాలని, తద్వారా మెరుగైన ఆరోగ్యం సొంతమవుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కిరణ్మయి అన్నారు. గురువారం పోషణ్ పక్షోత్సవాలలో భాగంగా ఎస్వీపురం అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రంగయ్య, అంగన్‌వాడీ టీచర్ వరలక్ష్మి, కోమలారాణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు


ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి శరత్‌చంద్ర

పాలసముద్రం: మండలంలోని పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని గురువారం ఫ్లయింగ్ స్క్వాడ్ శరత్‌చంద్ర తనిఖీ చేశారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ గణితం 1బీ, జువాలజి పేపర్ 1 పరీక్షకు మొత్తం 60 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 59 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రంలో మాస్ కాపీయింగ్ జరగకుండా డిపార్టుమెంట్ ఆఫీసర్ మురగయ్య విద్యార్థులను పక్కాగా తనిఖీ చేసి కేంద్రానికి పంపారు. పరీక్ష ప్రారంభమైన తరువాత జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి శరత్ చంద్ర ఆకస్మికంగా పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరుగుతున్నాయని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వినాయకం, పోలీసులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించండి



ఆక్రమణ తొలగింపును పర్యవేక్షిస్తున్న కమిషనర్ కేఎల్‌ఎన్‌రెడ్డి, పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్

పుత్తూరు రూరల్: పట్టణంలోని నగరం రోడ్డు, తిరుపతి–నగరి రోడ్డులో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మించిన తాత్కాలిక కట్టడాలు, రేకుల షెడ్డులను స్వచ్ఛందంగా తొలగించాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ కేఎల్‌ఎన్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం ఈ మేరకు పలు దుకాణాలదారులను నేరుగా ఆదేశిస్తూ, కొన్ని చోట్ల ఆక్రమణలను తొలగించారు. రోడ్లకు ఇరువైపులా తోపుడు బండ్లు, తాత్కాలిక షెడ్లు, వ్యాపార ప్రకటన బోర్డులను తొలగించాలని సూచించారు. కూరగాయల మార్కెట్ వద్ద ఆక్రమణలు తొలగించాలని సూచించారు. ఇది వరకే ఓసారి హెచ్చరించడం జరిగిందని, అయినా కొందరు ఇంకా ఆక్రమణలకు పాల్పడుతున్నారని, ఎవరినీ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. రెండు రోజుల్లో ఆక్రమణలు తొలగించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ..

క్లీన్ మున్సిపాలిటీగా పుత్తూరును తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిషనర్ కోరారు. వ్యాపారులు రోడ్లపైనే చెత్తను పడవేస్తున్నారని, ఇలాంటి వారికి జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు. హోటళ్ల యజమానులు పరిశుభ్రత పాటించాలని సూచించారు. మిగిలిపోయిన పదార్థాలను ఫ్రిడ్జుల్లో ఉంచి విక్రయించరాదని స్పష్టం చేశారు. ప్రతి హోటల్‌లో కమిషనర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఫోన్ నంబర్లు కనిపించాలన్నారు. స్థానిక కూరగాయల మార్కెట్ పరిసరాల్లో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించి, సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు.